పెయింటరు

ఒకప్పుడు
గోడలు, బేనర్లు, సైన్ బోర్డులు
కటౌట్లపై వాడి సంతకం
ఆకాశం అంచున వేలాడే సూర్యబింబంలా
వెలిగిపోతూండేది.
నీలిమందు నీళ్లల్లో ముంచిన పురికొస సాయంతో
వాడు గీసిన సరళ రేఖల మధ్య అక్షరాలు
గూటిలోని గువ్వల్లా ఒదిగిపోయేవి.
కుంచె లోని ఉడుత వెంట్రుకలమధ్య వర్ణాలు
సుశిక్షిత సైనిక కవాతులా కదిలేవి.
బేసిక్ కలర్స్ నుంచి డిరైవ్డ్ రంగుల్ని
సృష్టించటం వాడికి మాత్రమే తెలిసిన ఓ రసవిద్య.
అతను గీసిన చిత్రాల ముందు
ఎవరెవరో పారేసుకొన్న
ఓ పదిపన్నెండు కళ్లూ, రెండుమూడు హృదయాలూ,
ప్రతీ రోజూ తుడుపులో దొరుకుతూండేవి.
కొత్తవారికి వాడిరాతలు
నిశ్శబ్దంగా, నిర్దుష్టంగా దారిచూపేవి.
వాడి చెక్కపెట్టె నిండా రంగురంగుల డబ్బాలే!
ఇంద్ర ధనుస్సుని నిలువునా చీరి
ఒక్కోముక్కనీ ఒక్కో డబ్బాలో వేసుకున్నాడా అనిపించేది.
పెట్టెలో వివిధ సైజుల్లో బ్రష్ లుండేవి
సన్నని గీతనుండి, ఆకాశమంత పెద్ద రేఖ వరకూ
గీయటానికై.
వాని బట్టలపై, వంటిపై, హృదయంపై
చిలికిన రంగుల మరకలు
వాడికో గొప్ప దివ్యత్వాన్నిస్తున్నట్లు
మురిసిపోయేవి.
కానీ ఇప్పుడు
వినైల్ ప్రింట్లు, ఫ్లెక్స్ బేనర్లు
ఫొటోషాపులు, కోరల్ డ్రాలు
అన్నివైపుల్నుంచీ కమ్ముకొనే
శీతవేళలా వాడిని మింగేసాయ్.
వాడి ఉపాధి స్వప్నంలా జారిపోయింది.
వాని జీవితంలోకి
థిన్నర్ కలుపని చిక్కని నల్ల రంగు ఎగజిమ్మింది.
ఎప్పుడో ఎక్కడో వాడు
రోడ్డుపై క్రీస్తులానో, సాయిబాబాలానో
కళాత్మకంగా మన దారి కడ్డంపడతాడు.
ఇంకేం చేయాలో తెలీక!

-- **బొల్లోజు బాబా**